## బస్సు ప్రమాదంలో రాయికల్ వాసులు ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/రాయికల్ :** తెలంగాణలోని జగిత్యాల నుండి నెల్లూరు కనిగిరి వెళ్తుండగా బస్సు ప్రమాదం జరిగి రాయికల్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే ఉప్పు రమాదేవి ముత్తంగి వెంకటేష్ అనే ఇద్దరు జగిత్యాల నుంచి తమ సొంత గ్రామమైన నెల్లూరుకి వెళ్తుండగా బస్సులో మంటలు వ్యాపించడం తో అందులోనే సజీవ దహనమయ్యారు. వీరు గత 20 సంవత్సరాల క్రితం రాయికల్ కి వచ్చి కార్మికులుగా పనిచేస్తూ ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. వీరి మృతితో ఒక్కసారి గా విషాద ఛాయలు అలుము కున్నాయి.

## సురక్షిత తాగునీటి సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను గురువారం కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. 145 ఎంఎల్డీ సామర్థ్యం గల ప్లాంట్‌లో నీటి శుద్ధి ప్రక్రియలు, ఫిల్టర్ హౌస్, సెడిమెంటేషన్ ట్యాంకులను సమీక్షించారు. నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు.సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఇంజనీర్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాములోరి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి: ప్రణవ్

కల్యాణానికి హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పట్టువస్త్రాల సమర్పణ



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** అపర భద్రాద్రిగా పేరు గాంచిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో జరిగే కళ్యాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలవపందిళ్ళు,త్రాగు నీటి వసతి కల్పించామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. గురువారం ఇల్లందకుంట మండల కేంద్రం లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, హుజూరాబాద్ ఆర్డీఓ రమేష్, ఆలయ ఈఓ సుధాకర్, చైర్మెన్ రామారావు, డైరెక్టర్లు, స్థానిక అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణానికి సుమారు లక్ష మంది హాజరవుతారనీ అంచనా వేశామనీ,జమ్మికుంట నుండి ఇల్లందకుంట వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జమ్మికుంట రైస్ మిల్లర్లు,కాటన్ మిల్లర్ల ఆధ్వర్యంలో ఉచిత మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదానాన్ని ఏర్పాటు చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణానికి మంత్రి పొన్నం హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కళ్యాణానికి వచ్చే వాహనదారులకు పార్కింగ్ సంబంధించి పోలీసు శాఖ అధికారులు ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారని అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వలర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు ప్రతి సంవత్సరం రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో వరద నిర్వహణపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో యువ ఆపదమిత్ర పథకంలో భాగంగా వరద నిర్వహణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి, ఎన్‌సిసి 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కె జయంత, ఇతర ఎన్‌సిసి అధికారులతో కలిసి మాట్లాడారు. విద్యార్థులకు విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించడం అత్యం అవసరమని, దీనికి సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. ఎన్‌సిసి కేడెట్లకు ఈ అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారు సమాజానికి సేవ చేయగల సత్తా పెంపొందుతుందని తెలిపారు. లెఫ్టినెంట్ కర్నల్ ఏ.కె. జయంత మాట్లాడుతూ విధ్యార్థుల్లో విపత్తుల నిర్వహణ అవగాహన పెంపొంది వాటిని సమయానికి అమలు చేయడం అవసరమని, తద్వారా విధ్యార్థుల్లో బాధ్యతా భావం , సేవాస్ఫూర్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. యువ ఆపదమిత్ర పథకం ద్వారా కేడెట్లకు వివిధ విపత్తులపై విస్తృత అవగాహన కల్పించబడుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి విధ్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో భాగంగా ఎల్ఎండి వద్ద వరద పరిస్థితుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ప్రాయోగిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సిసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ వి.కృష్ణ పాల్గొన్నారు.

## సంకట స్థితిలో ప్రయాణ ప్రాంగణం!

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రయాణ ప్రాంగణం బస్ డ్రైవర్లకు సంకటంగా మారింది. ఒకేసారి ఎదురెదురుగా బస్సులు రావడంతో స్థలం సరిపోక ప్రయాణికులకు మరియు బస్ డ్రైవర్లకు ఇబ్బందికర పరిస్థితులు కలుగుతున్నాయి. గురువారం కామారెడ్డి వైపు నుండి ఎలక్ట్రిక్ బస్ రాగ సిరిసిల్ల వైపు నుండి మరో బస్ ప్రయానప్రాంగణంలోకి ఒకేసారి రావడంతో రెండు బస్‌లు ఒకదానికి ఒకటి రాపిడి జరిగి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు భయందోళన చెందగా, డ్రైవర్లు ఇరువురు మధ్య ఘర్షణ వాతవరణం ఏర్పడింది. ప్రయాణ ప్రాంగణంలో లోనికి, బయటకు వచ్చే దారి ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# 2025–26 సంవత్సరంలో రూ.7309 కోట్ల రుణాలు మంజూరు




కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/సిద్దిపేట:** 2025–26 అర్థిక సంవత్సరంలో 10736 కోట్ల రూపాయల రుణాల లక్ష్యంగా నిర్ణయించగా, 2025 డిసెంబర్ నాటికి 68శాతం 7309 కోట్ల రూపాయల రుణాలను అందించినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బ్యాంకర్లతో కలెక్టర్ హైమావతి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈనెలాఖరులోగా 2025–26 లక్ష్యంలో మిగత రుణాలను కూడ అందించాలని ఆదేశించారు. అలాగే 2026–27 అర్థిక సంవత్సరానికి ఆయా బ్యాంకుల రుణ నిల్వలు, మార్కెట్ షేర్ ఆధారంగా బ్యాంకుల వారిగా ఏప్రిల్ మాసంలో ప్రియారిటి, నాన్ ప్రియారిటి ఆదరణ లక్ష్యాలను నిర్దేశించటం జరిగింద న్నారు. వాటిని సాధించేందుకు సిద్దంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ రుణ ప్రణాళిక 2025–26 .సంవత్సరానికి రుణాల మంజూరు కొరకు ఏప్రిల్ 2వ చివరి తేదితో దరఖాస్తు చేసుకునేందుకు ప్రకటన ఇవ్వటం జరిగిందని,సబ్సిడితో అందించే అయా రుణాలు కూడ నిర్థిష్ట సమయంలో లబ్దిదారులకు అందించాలన్నారు. ఇదేకాకుండ ఎస్సీ, బిసి,మైనార్టీ సంక్షేమ శాఖల రుణాలు, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా ద్వారా మహిళా సంఘాలకు అందించే రుణాలను, వ్యవసాయ రుణాలను నిర్దేశిత లక్ష్యం మేరకు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ అబ్దుల్ హమీద్, ఎల్డీఎం హరిబాబు, డిఆర్డీఓ జైదేవ్‌ఆర్య, ఈడిఎస్సీ కార్పొరేషన్ విజయ్‌భార్గవ్. జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

**శేరిపల్లి బందారంలో జ్యోతిభా పూలే గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి... పాలకూర పప్పు నీళ్లాల ఉండటంపై వంట సిబ్బందిపై మండిపడ్డ కలెక్టర్:** సిద్దిపేట జిల్లా దౌల్తామాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామంలో మహాత్మ జ్యోతిభా పూలే బిసి బాలికల గురుకుల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా అకస్మీకంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అన్నం. బెండకాయ, పాలకూర పప్పు, రసం,నెయ్యి.పెరుగులను పరిశీలించారు. పాలకూర పప్పు మరింత పలచగా ఉంటుందా ఆని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే వండుతారా ? వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరలో నాణ్యత లోపిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. వంటగది, డైనింగ్ హాల్, ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గురుకుల ప్రాంగణం కలియ తిరిగారు. విద్యార్థులకు మరుగుదొడ్లు మైదానంలో ఉన్నాయని, రాత్రివేళల్లో భయపడుతున్నారన్నారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ తెలుపగా సానుకూలంగా స్పందించి ఈడబ్లుఐడిసి అధికారులు వచ్చినదానికి సంబధించిన ఎస్టిమేట్ వేస్తారని తప్పనిసరిగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. విద్యార్థుల క్రమశిక్షణ, అలవాట్లు ప్రవర్తన నిమాయవళీ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు.చదువు,భోజనం, వసతి విషయంలో ఏలాంటి లోటుపాట్లు లేకుండ చూసుకోవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు.



## పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, సదుపాయాలు, ఔషధాల లభ్యత, సిబ్బంది హాజరును సమీక్షించారు. రోగులతో మాట్లాడి చికిత్సపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, అత్యవసర సేవలు, ఔషధాల నిల్వలు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ జైపాల్ రెడ్డి,తహసిల్దార్ వర ప్రసాద్,ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి పండుగను ప్రశాంతగా జరుపుకోవాలి: డిసిపి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** పెద్దపల్లి పట్టణంలో శుక్రవారం జరిగే శ్రీరామనవమి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి అన్నారు. గురువారం రోజున స్థానిక డీసెంట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో జరగబోయే శోభాయాత్ర ప్రశాంత వాతావరణ జరుపుకోవాలని, గతంలోని మాదిరిగా ఇలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో శుభరాత్రి జరుపుకోవాలని,దీనికి విరూపక్షాల మత పెద్దలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సీఐ K. ప్రవీణ్ కుమార్, ఎస్సై J.లక్ష్మ ణ్ రావు లతో పాటు పట్టణంలో గల సర్వ మత పెద్దలు, ప్రముఖులు,నాయకులు పాల్గొన్నారు.

## బీడీ కమిషన్ రేటు పెంచాలి

ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు సుతారి రాములు




**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేసే బీడి కమిషన్ రేటు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు కోరారు. గురువారం రోజున సి ప్రభాకర్ భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బీడీ పరిశ్రమలను యజమానులకు కార్మికులకు మధ్య వారధిగా ఉండి బీడీలు చుట్టిన కార్మికుల నుండి సేకరించి గంపను తీసుకువచ్చి బీడీ సెంటర్ల లోని కార్ఖానాకు అందించడంలో ప్రధాన పాత్ర బీడీ పోషిస్తారు.తెలంగాణ జగిత్యాల జిల్లాల లోని దేశాయ్ బ్రదర్స్, బీడీ టెలిఫోన్ బీడీ,శివాజీ బీడీ,చార్ బాయ్, బీడీ సీజే పటేల్, బీడీ ఠాగూర్, బీడీ హెచ్.పి బీడీ, తదితర 14 బ్రాండ్ కలిగిన బీడీ పరిశ్రమల్లో దాదాపు 20,000 మంది బీడీ పనిచేస్తున్నారు. వీరికి కేవలం ఒక్క వెయ్యి బీడీలకు కమిషన్ రేటు 22 రూపాలు మాత్రమే యజమానులు చెల్లిస్తారు. మిగతా ఎలాంటి బెన్ఫిట్ లేదు కేవలం రెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే ఒప్పంద ఉంటుంది వీరికి పెరుగుతున్న ఎగుమతి దిగుమతి చార్జీలకు మరియు పెట్రోల్ పెరిగిన ధరలకు అనుకూలంగా గిట్టుబాటు కావడం లేదు కంపెనీ యజమానులు వివిధ కోతల పేరుతో వీరి కమిషన్ నుండి ముందుగానే కోత విధిస్తున్నారు. బీడీ తమ సొంత వాహనాలపై పల్లెల నుండి పట్టణాలకు బీడీల గంపలను చేరవేస్తున్న సమయంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతుంటాయి ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది కాబట్టి వీరికి పిఎఫ్ ఈఎస్ఐ బీమా సౌకర్యం కల్పించాలి గతంలో బ్రాంచి ఇచ్చేముందు లక్ష రూపాయల వరకు డిపాజిట్ డబ్బులను తీసుకొని వారి దగ్గరనే ఉంటున్నాయి అట్టి డబ్బులు జాయింట్ ఖాతాలో ఫిక్స్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీ రూపాయలను ్ధపాయలను ఇవ్వాలని కోరారు. బీడీ లేబర్ లైసెన్సు సెంట్రల్ ఎక్సైజ్ ఫీజులు ఫారెస్ట్ అధికారుల మామూలు బీడీ యజమానులే చెల్లించాలి. ప్రతి సంవత్సరంకు ఒకసారి కమిషన్ రేట్ పెంచుతూ అగ్రిమెంట్ చేయాలి. ఈ సమావేశంలో బీడీ కార్మిక సంఘం నేతలు ఎఐటియుసి వివిధ జిల్లాల నాయకులు బి గోవర్ధన్,అయ్యావార్ల లక్ష్మ ణ్, అనుమల్లా గంగాధర్, ఆరే రంగారెడ్డి భాను ప్రసాద్, కె.వి అనసూయ,ఎం.డి ముక్రం, కొక్కుల శాంత, ఎం.డి మౌలానా,తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువలో గోదారమ్మ పరవళ్లు



ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి

**ప్రజాపక్షం/గంగాధర:** చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించి కాపాడుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం రామడుగు మండలం లక్ష్మి పూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి అధికారులు వరద కాలువకు నీటిని విడుదల చేశారు. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడడానికి గోదారమ్మ వరద కాలువలో పరవళ్లు తొక్కింది. వరద కాలువలో పసుపు, కుంకుమ, పువ్వులు చల్లి గోదారమ్మకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సర్పంచులు రేండ్ల శ్రీనివాస్, రామిడి రాజిరెడ్డి, బీర్ల ఆనందం, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, కడారి హారిక కనుకయ్య, గుడి రజిని ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, దానె అనసూర్య ఓదెలు, లావణ్య తిరుపతి, బాబ లక్ష్మి మధు, కవిత మల్లేశం, దుబ్బాసి బుచ్చయ్య, మేర్గ కొండయ్య, మ్యాక వినోద్ తదితరులున్నారు.



**నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలి:** చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసెంబ్లీలో మట్లాడారు. ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో నీటి సమస్య ఉందని, సమస్యను పరిష్కరించడానికి కొండగట్టుతో లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కొండగట్టుతో పాటు పక్కనే ఉన్న జేఎన్‌టియూ కళాశాల, పలు గ్రామాలకు త్రాగునీటికి ఇబ్బంది ఉండదని సభ దృష్టికి తీసుకువచ్చారు. రామడుగు మండలంలోని మోతె రంగసాయిపల్లి, రుద్రారం గ్రామాల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, రోడ్డు మరమ్మత్తుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## మహిళా సంఘ భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/రాయికల్:** రాయికల్ మండలంలోని కిష్టంపేట, భూపతి పూర్, వడ్డే లింగాపూర్, ఒడ్డెర కాలనీ మరియు చెర్ల కొండాపూర్ గ్రామాల్లో గురువారం జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఎంపీవో సుష్మా,ఏఈ ప్రసాద్, ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచులు ఆకుల అంజాగౌడ్, గుర్రం భావన, బండారి మానస సాయి రాజ్, భోదాసు చంద్రశేఖర్, దేవునిరవి, ఉప సర్పంచ్ లు చాంద్ పాషా, సంజీవ చారి, బోదాసు రాజేష్, భూక్యా శంకర్, లక్ష్మి నారాయణ, నాయకులు మోర హనుమండ్లు కోల శ్రీనివాస్ ఏనుగు మల్లారెడ్డి రవీందర్ రావు బెజ్జంకి మోహన్ గన్నె రాజిరెడ్డి సురేందర్ నాయక్, అనుపురం శ్రీనివాస్, ముఖీద్, తిరుపతి గౌడ్, గ్రామ మండల నాయకులు, అధికారులు, మహిళ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే:** రాయికల్ పట్టణంలో నిగుడేటి రెడ్డి సంఘంలో రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 76 మంది ఆడబిడ్డలకు గురువారం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో భాగంగా మంజూరైన 76 లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, సర్పంచులు, కౌన్సిలర్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల :**మహిళపై దౌర్జన్యం చేయడంతో పాటు లైంగిక దాడి చేసిన కేసులో ఒకరికి 10 సంవత్సరాల కఠిన కారాగారా శిక్షతో పాటు రూ. 6 వేల జరిమానా విధిస్తూ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి నారాయణ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా దండెపెల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి నరేండ్ల మహేందర్ అనే వ్యక్తి జగిత్యాల జిల్లాలోని గొల్లపెల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ బాధితురాలిని వేధించాడు. రహస్యంగా చిత్రీకరించిన విడియోలను ఆధారంగా చేసుకుని మహిళను బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతేకాకుండా సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేస్తానని నిందితుడు మహేందర్ బెదిరింపులకు పాల్పడుతూ లైంగిక దాడి చేశాడు. బయభ్రాంతులకు గురైన బాధితురాలు గొల్లపెల్లి పోలీసులను ఆశ్రయించింది. దీంతో అప్పటి సీఐ కోరేశ్వర్ కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ చేపట్టారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటి అధికారులు శ్రీధర్, రాజు, కిరణ్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య కేసు వాధించగా నేరం రుజువైంది. దీంతో ముద్దాయి మహేందర్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.

## 100% పన్ను వసూళ్లపై దృష్టి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** గ్రామాలలో 100% పన్ను వసూళ్ల పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి నిర్మాణం యొక్క అసెస్మెంట్ 100% పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో అక్రమ నిర్మాణాలు జర్గకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రాలలో ఉన్న వ్యాపార సంస్థల యొక్క సంపూర్ణ వివరాలు దగ్గర అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో రైస్ మిల్లర్లు, ఇతర వాణిజ్య కార్యక్రమాలను మూసి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్టిసి బస్ స్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు ,వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలు కూడా పన్ను చెల్లించాల్సి ఉంటుందని, పెండింగ్ ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో తొలగించాలని అన్నారు.రోడ్ల పై చెత్త ఉండకుండా రెగ్యులర్ పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏప్రిల్ 2న జరిగే గ్రామ సభ కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి, గ్రామ సభ లో ప్రభుత్వం గత 2 సంవత్సరాలుగా అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలు, గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులను, ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామ సభ కార్యక్రమం పై ముందస్తుగానే ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డి ఎల్ పి ఓ లు, ఎంపీ ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి కామర్స్ మేనేజ్‌మెంట్ మీట్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్ లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ పిజి కళాశాల ఆద్వర్యంలో రాష్ట్రస్థాయి కామర్స్,మేనేజ్‌మెంట్ మీట్ 'అవిష్కార్ 2కె 26' ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్ చైర్మన్ వి.నరేందర్ రెడ్డి , విశిష్ట అతిథిగా డా.బుర్ర మధుసూధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ సంస్థ ఎల్లప్పుడూ విధ్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారికి తమ టాలెంట్‌ను వెలికి తీసుకునే అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విధ్యార్థులలోని నైపుణ్యాలను బయటకు తీసుకురావడంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యంగ్ మేనేజర్, యంగ్ కామర్స్ అవార్డు, కార్పోరేట్ వాక్, స్ట్రెస్ ఇంటర్వ్యూ నర్తనశాలతో పాటు 19 రకాల కాంపిటీషన్స్ నిర్వహించామని, 15 కాలేజీ విధ్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. డా.వి.నరేందర్‌రెడ్డి తన ప్రసంగంలో యువత చదువుతో పాటు వివిధ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనాలని, సమగ్ర అభివృద్ధి కోసం వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లయన్ కెప్టెన్ బి.మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మాయిలు అబ్బాయిలకు ఏమాత్రం తక్కువ కాదని, వారు అన్ని రంగాలలో ముందుకు వస్తూ శక్తివంతంగా ఎదుగుతున్నారని తెలిపారు. ముగింపు సమావేశానికి శాతవాహన యూనివర్సిటీ కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ అధిపతి డా.హరికాంత్ విచ్చేసి ఫైనల్ లెవెల్ పోటీలకు ఎంపికైన విజేతలలో హన్మకొండకు చెందిన వాగ్దేవి డిగ్రీ కాలేజీ విధ్యార్థులకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు వివిధ పాటవ పరీక్షలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, ప్రశంస బహుమతులను అందజేశారు.



## సొంత ఖర్చులతో మాజీ ఎమ్మెల్యే కోనప్ప రోడ్డు పనులు

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండలంలోని మొగడ్‌ధగడ్ గ్రామం నుండి వైగాం గ్రామం వరకు మోరం మట్టి రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంఎల్‌ఎ కోనేరు కోనప్ప సొంత ఖర్చులతో ప్రారంభించారు. గతంలో ఆయన ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో రోడ్డు పనులకు అనుమతులు లభించినప్పటికీ ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు సమస్యను కోనప్ప దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ప్రభుత్వ సహాయం లేకపోయినా ప్రజల సౌకర్యార్థం స్వయంగా నిధులు సమకూర్చి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ రోడ్డు పూర్తయితే రాకపోకలు సులభతరం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎంఎల్‌ఎ స్వయంగా ముందుకు వచ్చి పనులు ప్రారంభించడం అభినందనీయమని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## తేనెటీగల దాడిలో 18 మంది కూలీలకు గాయాలు

**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో గురువారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు విరుచుకుపడటంతో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీ ప్రాంతంలో సుమారు 120 మందికి పైగా కూలీలు గుంతలు తవ్వుతున్న సమయంలో సమీపంలోని చెట్టుపై ఉన్న తేనెతుట్టె కదలడంతో ఈ ప్రమాదం జరిగింది. వేల సంఖ్యలో తేనెటీగలు దాడి చేయడంతో భయాందోళనకు గురైన కూలీలు ప్రాణాలు కాపాడుకోవడానికి అడవిలో చెల్లాచెదురుగా పరుగెత్తారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో దండేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యాధికారి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం దాడిలో గాయపడిన శశి, గంగ, పద్మ, సత్తన్న, సుజాతల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, టిఎ జగన్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.



## అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/సిర్పూర్ టి/కాగజ్‌నగర్ :** చింతలమానేపల్లి నుండి మహారాష్ట్రలోని అహేరికి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ డిటి రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి మండల కేంద్రం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన ఆయన 60 బస్తాల పిడిఎస్ సన్న బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని అహేరి ప్రాంతానికి చెందిన నేహాల్ షేక్ తన వాహనాలను తెలంగాణ సరిహద్దు గ్రామాలకు పంపించి స్థానిక దళారుల సహాయంతో ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి నేహాల్ షేక్ తో పాటు మరో ఐదుగురు నిందితులపై 6ఎ కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎవరైనా పిడిఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎన్ఫోర్స్మెంట్ డిటి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## రాముని కల్యాణ మహోత్సవానికి ముస్తాబైన రామాలయం

**ప్రజాపక్షం/ముధోల్ :** మండలంలోని అష్టా గ్రామంలో గల రామాలయం నేడు జరిగే రాముని కల్యాణమహోత్సవానికి ఆలయం విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి,గ్రామ సర్పంచ్ రావుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా రామునికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించి జనన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. అనంతరం కల్యాణమహోత్సవం జరిపి గ్రామంలో అంగరంగా వైభవంగా శోభాయాత్ర జరుపనున్నట్లు పేర్కొన్నారు. రామనవమి అందరి పండుగ ఇట్టి పండుగను అట్టహాసంగా జరిపి గ్రామ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. గ్రామ దేవుడైన రాముని కల్యాణ మహోత్సవానికి గ్రామస్తులందరూ సహకారం అందించాలని కోరారు.అష్టా గ్రామ రామాలయం మహోత్సవం అందరికి తెలిసేలా సమష్టిగా పండుగను నిర్వహించి రాముని ఆశీస్సులు పొందుదామన్నారు. శోభాయత్ర అనంతరం రామాలయ ప్రాంగనంలో భక్తి గీతాలతో ఆర్కెస్ట్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి శ్రీరాముని ఆశీస్సులు పొంది విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే రామనవమికి సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూలుకు ‘సై’.. ఇందిరమ్మ ఇళ్లకు ‘నై’

### అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్న ఇటుకల్‌పాడ్ పేదలు



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం సామాన్య పేదవాడి సొంతింటి కలను కల్లలు చేస్తోంది. సిర్పూర్ టి మండలంలోని ఇటుకల్‌పాడ్ గ్రామంలో నెలకొన్న వింత పరిస్థితి అధికారుల ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. ఏళ్ల తరబడి ఇక్కడే నివసిస్తున్న ప్రజల నుండి గ్రామపంచాయతీ ద్వారా ఏటా ఇంటి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం, వారు ఇల్లు కట్టుకుంటామంటే మాత్రం ‘అటవీ భూమి’ అంటూ అడ్డుతగులుతుంది. ఒకవైపు పౌర సదుపాయాలు కల్పిస్తూ పన్నులు దండుకుంటున్న యంత్రాంగం, నివాస హక్కుల విషయంలో మాత్రం అటవీ శాఖ కొర్రీలకు తలొగ్గుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటుకల్‌పాడ్ గ్రామానికి సుమారు 120 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినప్పటికీ, అటవీ శాఖ అధికారుల అభ్యంతరాల వల్ల ఒక్క ఇటుక కూడా పడకపోవడం గమనార్హం. గతంలో మంజూరైన ఇళ్లను సైతం రద్దు చేయడం బాధితులను మరింత కుంగదీస్తోంది. ఒకవేళ అది అటవీ భూమి అయితే, అక్కడ గ్రామ పంచాయతీని ఎలా ఏర్పాటు చేశారు? ఏ ప్రాతిపదికన ఏటా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు? అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. ఒక చేత్తో పన్నులు వసూలు చేస్తూ, మరో చేత్తో నివాస హక్కులను నిరాకరించడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య నెలకొన్న ఈ ‘భూ’పోరాటంలో సామాన్య ప్రజలు బలిపశువులవుతున్నారు. ఏళ్ల తరబడి గూడు లేక పూరిళ్లలో మగ్గుతున్న పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉన్న జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకొని, అటవీ అధికారుల ఆంక్షలను తొలగించి, ఇటుకల్‌పాడ్ గ్రామ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.




## ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం విగ్రహాన్ని నెలకొల్పాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, నైజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాట ఉద్యమ రూపకర్త, దున్నేవాడికే భూమి కావాలని, గీసేవాడికే చెట్టు ఉండాలని పోరాడిన నాయకుడు అమరజీవి కామ్రేడ్ ధర్మభిక్షం అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపి, అమరజీవి కామ్రేడ్ దర్మబిక్షం 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కల్లు సొసైటీలు ఏర్పాటు చేయడం వీరి కృషి అని అన్నారు. ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంకుబండ్‌పై నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ నాయకులు పి.హనుమాండ్లు, కుసాల్, రజాక్ పాల్గొన్నారు.

## ఎసిబి వలలో ఎస్ఐ అశోక్



**ప్రజాపక్షం/నిర్మల్/మామడ :** ప్రజలకు రక్షణగా ఉండాల్సిన కంచే చేను మేసిన చందంగా.. శాంతిభద్రతలను కాపాడాల్సిన అధికారి కాసుల కక్కుర్తికి పాల్పడి ఎసిబి అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని సాగిస్తున్న అక్రమ వసూళ్ల పర్వానికి తెరపడింది. ఒక రియల్టర్ వ్యవహారంలో తలదూర్చి సెటిల్‌మెంట్ పేరుతో ఏకంగా రూ.40,000 లంచం డిమాండ్ చేసిన ఎస్సై, చివరకు రూ.20,000 తీసుకుంటుండగా ఎసిబి అధికారులు మెరుపుదాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సాక్ష్యాధారాలతో సహా దొరికిపోయిన ఈ అవినీతి అధికారి బాగోతం జిల్లా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది.

**వేధింపులు భరించలేక ఎసిబి చెంతకు**

సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని పక్షపాత వైఖరి ప్రదర్శిస్తు, డబ్బులు ఇస్తేనే పనిచేస్తానంటూ భీష్మించుకు కూర్చున్న ఎస్సై తీరుతో విసిగిపోయిన బాధితుడు చివరకు ఎసిబిని ఆశ్రయించాడు. పక్కా పథకం ప్రకారం గురువారం లంచం సొమ్మును అందుకుంటున్న సమయంలో ఎసిబి డిఎస్పీ బృందం ఎస్సైని చుట్టుముట్టింది. రసాయన పరీక్షల్లో అయన చేతులు ఎర్రబడటంతో అవినీతి బాగోతం బట్టబయలైంది. పోలీస్ స్టేషన్‌ను ఒక వ్యాపార కేంద్రంగా మార్చుకుని, సామాన్యులను పీడించిన ఈ అధికారిపై గతంలోనే అనేక ఫిర్యాదులు వెల్లువెత్తినా, ఇప్పుడు ఎసిబి రూపంలో అయన అక్రమ సామ్రాజ్యం కుప్పకూలింది.

**బర్తరఫ్ చేయాలని ప్రజల డిమాండ్**

నిష్పక్షపాతంగా ఉండాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, స్వార్థం కోసం వర్గాలను విడదీసి పబ్బం గడుపుకున్న ఇలాంటి అధికారిపై కేవలం సస్పెన్షన్ మాత్రమే కాకుండా, కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుని సర్వీస్ నుండి బర్తరఫ్ చేయాలని మామడ మండల నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తుండగా, ఈ ఘటన పోలీస్ శాఖలోని ఇతర అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

## బెల్లంపల్లి అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

### కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధుల నుండి రూ.2కోట్ల 50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2026–27 సంవత్సరానికి గాను రూ.32 కోట్ల 42 లక్షల అంచనా బడ్జెట్ కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని వివరించారు. బెల్లంపల్లి శాసనసభ్యుడు గడ్డం వినోద్ మాట్లాడుతూ ఏడాది కాలంలో మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలోని మురికివాడలను పూర్తిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకవర్గ సభ్యులు జవాబుతారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, సబ్‌కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్పర్సన్ సత్యనారాయణ, కౌన్సిలర్లుపాల్గొన్నారు.

**రహదారి విస్తరణకు అడ్డంకులు ఉండకూడదు**

**మందమర్రి :** జాతీయ రహదారి విస్తరణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్ నుంచి చంద్రాపూర్ వరకు జరుగుతున్న జాతీయ రహదారి 63 విస్తరణ పనులను మండల తహసీల్దార్ సతీష్ కుమార్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రయాణ సౌకర్యాల కోసం చేపట్టిన పనులు వేవంతంగా నాణ్యతతో పూర్తికావాలని సూచించారు. పనుల అమలులో ఏవైనా అవరోధాలు తలెత్తితే సంబంధిత అధికారులు సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెంబి ఎంపిడిఒ ‘సగం జీతం’ దందా!

### ఆఫీసుకు రాకుండానే ప్రైవేటు వ్యక్తులతో పాలన

### సుధాకర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి,అడ్డగోలు సంపాదనకు అలవాటు పడ్డ పెంబి ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి అక్రమ సామ్రాజ్యంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యుద్ధం ప్రకటించింది. మారుమూల ఆదివాసీ ప్రాంతమైన పెంబి మండలంలో మండలపరిషత్ కార్యాలయాన్ని ఒక ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని, విధులకు రాని ఉద్యోగుల నుంచి సగం జీతం వసూలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు డాకూరవ తిరుపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నిర్మల్ కలెక్టరేట్ ఎఒను కలిసి ఈ అక్రమ వసూళ్లపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

**జీతం ఇంట్లో..పని బయట..మధ్యలో కమిషన్..!**

పెంబి మండలపరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సీతారాం, అటెండర్ రాథోడ్ ప్రియాంక గత మూడు, నాలుగేళ్లుగా ఆఫీసు ముఖమే చూడటంలేదన్న విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. వీరు విధులకు రాకపోయినా ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి వారికి హాజరు వేస్తూ, ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా సదరు ఉద్యోగుల జీతాల్లో సగం వాటా ను ఎంపిడిఒ కమీషన్ రూపంలో జేబులో వేసుకుంటున్నట్లు సమాచారం.

**ప్రైవేటు వ్యక్తుల రాజ్యం.. అటెండర్ సీట్లో సురేష్..!**

అటెండర్‌గా ఉండాల్సిన రాథోడ్ ప్రియాంక తన స్థానంలో కొత్తపల్లి సురేష్ అనే వ్యక్తికి నెలకు రూ.10,000 ఇచ్చి పని చేయిస్తుండగా, జూనియర్ అసిస్టెంట్ సీతారాం మరో వ్యక్తికి రూ.5,000 ఇచ్చి తన విధులను మమ అనిపిస్తున్నారు. ప్రభుత్వ అధికార ముద్ర ఉండాల్సినచోట ప్రైవేటు వ్యక్తులు తిష్టవేయడం వెనుక ఎంపిడిఒ ప్రోత్సాహం ఉండటం గమనార్హం. ‘‘నన్ను అడిగేవారు లేరు..పై అధికారులకు డబ్బులు ఇస్తే సరిపోతుంది’’ అనే ధీమాతో సుధాకర్ రెడ్డి ఈ అరాచకానికి పాల్పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు మండిపడ్డారు.

**కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి**

ధనార్జనే ధ్యేయంగా మారి,వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ఎంపిడిఒ సుధాకర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని, సక్రమంగా విధులకు రాని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాకూర్ తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంత ప్రజలకు అందాల్సిన సేవలను అడ్డగోలుగా అమ్ముకుంటున్న ఇలాంటి అధికారులను విధుల్లో ఉంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పానగంటి నరేష్, తదితరులు పాల్గొని కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు.

## జిల్లాలో ఇంధన కొరత లేదు..పుకార్లను నమ్మొద్దు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసంలేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద క్యూలైన్లు కనిపిస్తున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అపోహలేనని స్పష్టం చేసిన కలెక్టర్ అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందన్నారు.

పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా కొనసాగుతోందని,పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ వద్ద తగిన నిల్వలు ఉన్నట్లు ధృవీకరించినట్లు తెలిపారు.

**ఎల్పీజీ గ్యాస్ సరఫరా సాధారణంగానే..**

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని సూచించారు.

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ..**

పరిస్థితిని దగ్గరగా గమనించేందుకు అదనపు కలెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

**ఆందోళన చెందొద్దు**

సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ‘ఆందోళనకు గురికావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని,ప్రజలకు అవసరమైన ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓలు తాశీల్దార్లు, మైనింగ్, ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలాల్లో ఏప్రిల్ 1 నుండి వంద శాతం ఇసుక సరఫరా ‘‘మన ఇసుక వాహనం’’ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు.

తహశీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు ఇసుక వాగు ప్రాంతాలను, దళారులు ఇసుక డంపు చేసే ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు రమాదేవి, జయచంద్ర రెడ్డి, డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐలు మహేష్, జార్జి, ఇతర అధికారులు సిబ్బంది పల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్య సేవలపై కలెక్టర్ దృష్టి

### ప్రత్యేక వైద్య శిబిరాల తనిఖీ

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని పిహెచ్‌సీలు యూపిహెచ్‌సీలలో సెప్షలిస్టు వైద్యులతో నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిభిరాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం పరిశీలించారు.. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుప్రతిని ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాల పనితీరుని పరిశీలించారు. ఆసుపత్రిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ డేటా ఎంట్రీ రోగుల వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ రోగులకు ఇబ్బందులు కలగకుండా ఓపి రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచాలని ఇంటర్నేషల్ వేగాన్ని మెరుగుపర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ కు సూచించారు. అనంతరం ఓపి విభాగాలు సర్జికల్ స్త్రీ ,పురుషుల మెడికల్ ఓపీలు పార్మసీ డిస్పెన్సింగ్ యూనిట్ పార్మసి స్టోర్స్ రిజిస్ట్రేషన్ కౌంటర్లు క్రిటికల్ కేర్ విభాగం తదితరాను పరిశీలించి రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. తదుపరి స్థానిక రైతు బజారు సమీపంలోని మైనార్టీ రెసిడిన్షియల్ పాఠశాలను సందర్శించి కలెక్టర్ వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆర్‌బిఎస్‌కే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్ష నిర్వహించారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్క్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న ప్రత్యేకవైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డిసిహెచ్ఎస్ కవిత డాక్టర్ శశాంక్ తదతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

### ఎస్.కె.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి దివంగల నేత మాజీ ప్రధాని ఉక్కు మహిళ ఇందిరా గాంధీ పేరు ప్రస్తావించటం సిగ్గుచేటని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి, చేపూర్ సర్పంచ్ సారంగి శాంతికుమార్ పల్లె (హరిపూర్) సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్‌లు మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభలో లేని మహానేత నాయకురాలు పేరు ఎలా ప్రస్తావిస్తారని వారన్నారు. ఇందిరాగాంధీ మా దేవత ఈ దేశానికి ప్రధానిగా సేవలందించిన ఇందిరాను ఉద్దేశించి మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆమెను ఉక్కు మహిళ అని సంబోధించారని అంతటి ఖ్యాతి ఉన్న ఇందిరా గాంధీ పేరు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

బరాబర్ క్షమాపణ చెప్పాల్సిందే వెంటనే రాకేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## శ్రీరామ నవమి వేళ మద్యం దుకాణాలు బంద్

**ప్రజాపక్షం/ఎడపల్లి :** శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో కఠిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. పండగవేళ ఎటువంటి అంవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడే ఉద్దేశ్యంతో బోధన్ నియోజకవర్గంలోని అన్ని మద్యం దుకాణాలను ఒకరోజు పాటు మూసి వేయాలని పోలీస్ కమీషనర్ సాయి చైతన్య కీలక ఆదేశాలు జారీ చేశారు. బోధన్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో వైన్ షాపులు, కల్లు బట్టీలు, బార్లు, క్లబ్బులు, నేటి ఉదయం ఆరు గంటల నుంచి రేపు ఉదయం ఆరు గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు.

శ్రీ రామ నవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు.

